# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 223 పేజీలు : 8 వెల : రూ.2/- సోమవారం 07 సెప్టెంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## ఢిల్లీలో కూలిన భవనం.. ముగ్గురి మృతి

**ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఘోర ప్రమాదం**

**ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, పలువురిని కాపాడిన సహాయక బృందాలు**

**మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి**

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాలు ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్**

**శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అనుమానాలు**



**ఢిల్లీ మన జనప్రగతి సెప్టెంబర్ 06:** దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో మరమ్మతు పనులు జరుపుకుంటున్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. **మిగతా 2లో...**

## ఇస్రో ప్రైవేటీకరణ అవాస్తవం

**ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ**

**మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ**

**అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో**

**ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి**




**ఢిల్లీ మన జనప్రగతి సెప్టెంబర్ 06:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది **మిగతా 2లో....**

## సాత్విక్-చిరాగ్ సంచలనం..

**చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం**



**చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకున్న సాత్విక్-చిరాగ్**

**ఫైనల్‌లో చైనా జోడీపై హోరాహోరీ పోరులో విజయం**

**తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం**

**ఈ సీజన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్**

**గాయాలతో బాధపడుతున్నా అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత జోడీ**

**ఢిల్లీ మన జనప్రగతి సెప్టెంబర్ 06:** భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ **మిగతా 2లో...**

# కొత్త పింఛన్లకు దరఖాస్తులు

**నేటి నుంచి 16 వరకు స్వీకరణ**

**ఎన్టీఆర్ భరోసాలో కొత్త అధ్యాయం**

**మరింత మందికి సామాజిక భద్రత**

**ఇప్పటికే 62 లక్షల మందికి భరోసా**

**కొత్త పింఛన్ల ప్రక్రియకు ప్రత్యేక ఏర్పాటు**

**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 06:** రాష్ట్రంలో కొత్త పింఛన్లకోసం ఎంతగానో ఎదురు చూస్తున్న పేదలకుప్రభుత్వం తీపి కబురు అందించింది. నేటి నుంచి ఈనెల 16వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. ఇప్పటికే సామాజిక భద్రత పింఛన్లతో 62 లక్షల మంది పేదలకు ప్రతినెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు,దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంకింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. **మిగతా 2లో...**




## మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

**నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు**

**మార్చి2029 నాటికి మత్తు చిత్తు**

**కేంద్ర హోం మంత్రి అమిత్ షా**

**పనాజీ:మన జనప్రగతి సెప్టెంబర్ 06:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం గోవాలోమీడియాతో మాట్లాడుతూ, 2029 నాటికి భారతదేశాన్నిపూర్తిగా మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు మోడీ ప్ర భుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందనితెలిపారు. మాదకద్రవ్యాలు లేని యువశక్తి 2047 నాటికివికసిత భారత్ను నడిపిస్తుందనేది ప్రధాని నరేంద్ర మోడీలక్ష్యమని పేర్కొన్నారు. నక్సలిజం, ఉగ్రవాదం వంటి ముప్పులను ఎలా **మిగతా 2లో...**



## ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్న కేసీఆర్

**తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి**

**: మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ డిమాండ్**

**బీఆర్ ఎస్ పదేండ్ల పాలన.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనపై చర్చకు సిద్ధమంటూ సవాల్**

**హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం,**



**2లో.**



## 8 హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు..

**హైదరాబాద్ : మన జనప్రగతి సెప్టెంబర్ 06:** దేశంలోని న్యాయవ్యవస్థలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల మేరకు ఎనిమిది హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను (సీజే) నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు **2లో...**



## అసెంబ్లీ సమావేశాల తర్వాత పాదయాత్ర

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం**

**కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు**

**సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి**

**అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం**

**ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్**

**హైదరాబాద్ : మన జనప్రగతి సెప్టెంబర్ 06:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది.

ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం **మిగతా 2లో...**

## ఉప్పాడ రక్షణ గోడ నిర్మాణానికి సర్వే పనులు ప్రారంభం

**డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం రంగంలోకి ఐఐటీ మద్రాస్ నిపుణులు**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో కదులుతున్న పనులు**

**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 06:** దశాబ్దాలుగా సముద్ర కోతతో విలవిలలాడుతున్న పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ తీరప్రాంత వాసుల చిరకాల స్వప్నం సాకారం దిశగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి. **మిగతా 2లో...**



## ఏపీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్.. పీవీ మోహన్‌కు బాధ్యతలు

**ప్రస్తుత ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్‌పై వేటు**

**ఏపీకి చెందిన సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్ బాధ్యతలు**

**పంజాబ్‌కు సచిన్ పైలట్, అస్సాంకు భూపేష్ భగేల్ ఇన్‌ఛార్జ్‌లు**

**నియామకాలను ప్రకటించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్**



**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 06:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పార్టీలో పలు కీలక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు**మిగతా 2లో...**

# అసెంబ్లీ సమావేశాల తర్వాత పాదయాత్ర

**మొదటి పేజీ తరువాయి**

వివరాలను అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు."ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం" అని హరీశ్ రావు తెలిపారు. అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను 'నిషేధిత జాబితా'లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు.

అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే వీధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు.

ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. 'ఆరు గ్యారెంటీలు', రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

# ఇస్రో ప్రైవేటీకరణ అవాస్తవం

**మొదటి పేజీ తరువాయి**

ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది.ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది.

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది.సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.

భవిష్యత్ లక్ష్యాలు ఇవే..

భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది.

ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

# ఢిల్లీలో కూలిన భవనం.. ముగ్గురి మృతి

**మొదటి పేజీ తరువాయి**

శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు.

సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు.

ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, "భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం" అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

# ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్న కేసీఆర్

**తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి**

**: మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ డిమాండ్**

**బీఆర్ ఎస్ పదేండ్ల పాలన.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనపై చర్చకు సిద్ధమంటూ సవాల్**

**హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అజారుద్దీన్,**

**పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు**



**హైదరాబాద్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:**
ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీకి రాని బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ఽ ఆ హోదాను అపహాస్యం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న ఆయన సభకు రాకపోవటం అత్యంత శోచనీయమని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ ఆయన కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఇదే అంశంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు సారధ్యంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ రెడ్డి, మాజీ ఎంపీలు మధుయాష్కీ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూఽ'పదేండ్ల పాలనలో బీఆర్ ఎస్ రాష్ట్రానికి ఏం ఒరగబెట్టిందో.. రెండున్నరేండ్లలో కాంగ్రెస్ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందో చర్చించేందుకు మేం సిద్ధం.. మీరు సిద్ధమాఽ?' అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు.

బీఆర్ ఎస్ పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలుఽ గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష బాధ్యత ఇచ్చారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానిది కీలక పాత్ర అని చెప్పారు. కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తే ఆయన అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తున్నారని ఎద్దేవా చేశారు. అందుకే ఎమ్మెల్యే పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో చెప్పాలని కేసీఆర్ ను నిలదీశారు. అధికారం ప్రజలిచ్చే కానుకని, వారి ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగానే తమ ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ప్రజలకిచ్చిన మాటకు కట్టుబడి అనేక హామీలను అమలు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లిస్తామని చెప్పి ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు భిన్నంగా ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టించటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులకు చదువుతో పాటు సంస్కారం అవసరమని హితవు పలికారు. పదేండ్ల కాలంలో విదేశీ పెట్టుబడులు ఏ మేరకు తెచ్చారో చెప్పాలని నిలదీశారు.తాము రెండున్నరేండ్లలో రూ.లక్షా 78వేల కోట్ల విదేశీ పెట్టుబడులతోపాటు గ్లోబల్ సమ్మిట్‌తో రూ. ఐదు లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. 70వేలకు పైగా ఉద్యోగాలను ఇచ్చామని, ఇంకో రెండున్నరేండ్లలో మరిన్ని ఉద్యోగాలు ఇచ్చితీరుతామని హామీనిచ్చారు. ఉద్యమకారులు గద్దర్, అందెశ్రీని కేసీఆర్ విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తమ ప్రభుత్వం వారిని సముచితంగా గౌరవించిందని గుర్తు చేశారు. కుల సర్వేతో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని వివరించారు. బీజేపీ నేతలు తమ ప్రభుత్వం గురించి వ్యంగంగా మాట్లాడటం తప్ప వారు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. కేసీఆర్‌ను కొడుకు కేటీఆర్, అల్లుడు హరీష్ రావు అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారా? అని ఎద్దేవా చేశారు. ఒకవేళ అల్లుడు, కొడుక్కి అవకాశం ఇవ్వాలనుకుంటే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకోవాలని కేసీఆర్ కు సలహానిచ్చారు.గత బీఆర్ఎస్ పాలనలో ధనిక రాష్ట్రమైన తెలంగాణ అప్పులపాలైందని వాపోయారు. ఆ ప్రభుత్వం రూ. ఎనిమిదిన్నర లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిందని, ఈ క్రమంలో తాము ఓ వైపు కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో కేసీఆర్ వైద్య రంగాన్ని పట్టించుకోలేదని విమర్శి ంచారు. స్కిల్ యూనివర్శిటీతో యువతలో నైపుణ్యా భివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును తొక్కిపెట్టి ఆయా తరగతుల నోటికాడి కూడును లాక్కుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఉప్పాడ రక్షణ గోడ నిర్మాణానికి సర్వే పనులు ప్రారంభం

**మొదటి పేజీ తరువాయి**

ఈ ప్రాజెక్టు డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన కోసం ప్రతిష్ఠాత్మక ఐఐటీ-మద్రాస్ నిపుణుల బృందం రంగంలోకి దిగింది.

గత వారం రోజులుగా ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం ఉప్పాడ తీరంలో క్షేత్రస్థాయి సర్వేను ప్రారంభించింది. అత్యాధునిక డ్రోన్లు, బీచ్ ప్రొఫైలింగ్, ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్ఎస్ ఆర్‌టీకే వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తీరం వెంబడి సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. సముద్ర గర్భంలోనూ, తీరం పొడవునా భౌగోళిక పరిస్థితులు, అలల తీవ్రత, సముద్ర ప్రవాహాల దిశ, కోతకు గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తున్నారు. ఇందులో భాగంగా సముద్రపు లోతును కొలిచే బాతిమెట్రిక్ సర్వేతో పాటు, తీరంలోని ఇసుక, మట్టి నమూనాలను సేకరించి పరీక్షిస్తున్నారు.

గత 40 ఏళ్లుగా ఉప్పాడ తీరంలో సముద్ర కోత కారణంగా వందల ఎకరాల భూమి, కొన్ని గ్రామాలు సముద్రంలో కలిసిపోయాయి. ఎందరో మత్స్యకారులు, రైతులు సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నడుం బిగించిన పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.323 కోట్ల జాతీయ విపత్తు నిర్వహణ నిధిని సాధించారు.

ఈ ప్రాజెక్టు పనులను పవన్ కళ్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. డిజైన్, డీపీఆర్ రూపకల్పనతో పాటు సమాంతరంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలో పిఠాపురం పర్యటన సందర్భంగా ఐఐటీ నిపుణులతో సమావేశమై పనుల పురోగతిని సమీక్షించనున్నారు. ఈ సర్వే పూర్తయిన తర్వాత ఐఐటీ మద్రాస్ ఇచ్చే నివేదిక ఆధారంగా రక్షణ గోడ డిజైన్‌ను ఖరారు చేసి, నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

# సాత్విక్-చిరాగ్ సంచలనం..

**మొదటి పేజీ తరువాయి**

హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు.గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు.

నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.

ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.

## ఏపీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్.. పీవీ మోహన్‌కు బాధ్యతలు

**మొదటి పేజీ తరువాయి**

చెందిన ఎమ్మెల్సీ పీవీ మోహన్‌ను నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న తమిళనాడు ఎంపీ మాణికం ఠాగూర్‌ను తప్పించి, ఆయన స్థానంలో మోహన్‌కు బాధ్యతలు అప్పగించింది.

ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం రాత్రి ఈ నియామకాలకు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్న పీవీ మోహన్, గతంలో కేరళ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా పనిచేశారు. తాజా మార్పులతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు కూడా కొత్త ఇన్‌ఛార్జ్‌లను నియమించారు.ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ నేత సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అదేవిధంగా, రాజస్థాన్ సీనియర్ నేత సచిన్ పైలట్‌కు పంజాబ్ ఇన్‌ఛార్జ్‌గా, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్‌కు అస్సాం ఇన్‌ఛార్జ్‌గా, రాజ్యసభ సభ్యుడు రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాకు గుజరాత్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు కేటాయించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది.

# కొత్త పింఛన్లకు దరఖాస్తులు

**మొదటి పేజీ తరువాయి**

సోమవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్తపింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ. 4,000 పింఛన్.. కొత్త అర్హులకు గొప్ప అవకాశంరాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 62 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన పింఛన్లను ప్రభుత్వం క్రమం తప్పకుండా అందిస్తోంది. అయితే, వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు పింఛను అందుకోలేకపోయిన పేదలకు, నూతనంగా అర్హత సాధించిన వారికి కూడా లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది.**నూతన పింఛన్ల ప్రక్రియ - పూర్తి షెడ్యూల్**సెప్టెంబర్ 7 16: నూతన పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ.సెప్టెంబర్ 17 21: జనరల్ వెరిఫికేషన్ (సాధారణ పరిశీలన).సెప్టెంబర్ 22 24: ఫిజికల్, శాఖాపరమైన ధ్రువీకరణ, అర్హతల నిర్ణయం.సెప్టెంబర్ 25 26: 'సెర్ప్' ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ.దరఖాస్తు కేంద్రాలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 'స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు' (గ్రామ/వార్డు సచివాలయ) కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారు.దరఖాస్తుదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గాను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల వద్ద ముందస్తుగా ప్రత్యేక కౌంటర్లు, సదుపాయాలు ఏర్పాటు చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు అవసరమైన పత్రాలతో సమీప సచివాలయానికి వెళ్ళి తమ దరఖాస్తులను అందజేయాలని అధికారులు సూచించారు. అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరితగతిన నూతన పింఛన్లు మంజూరు చేయనున్నారు.

# 8 హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు..

**మొదటి పేజీ తరువాయి**

జారీ చేసింది. ఈ నియామకాల వివరాలను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కొలీజియం సిఫార్సు చేసిన కొద్ది రోజులకే కేంద్రం వేగంగా స్పందించి ఈ నియామక ప్రక్రియను పూర్తి చేయడం గమనార్హం.నియామకాల వివరాల్లోకి వెళితే.. ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వల్లూరి కామేశ్వరరావును పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అదేవిధంగా బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ రవీంద్ర వి. ఘుగే కలకత్తా హైకోర్టుకు నేతృత్వం వహించనున్నారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ అగర్వాల్‌ను రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠి బాంబే హైకోర్టు కొత్త సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

**మొదటి పేజీ తరువాయి**

అరికట్టామో, అదే పద్ధతిలో మాదకద్ర వ్యాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతా మని ధీమా వ్యక్తం చేశారు. 2014కు ముందు మాదకద్రవ్యాలపైపోరాటం చిన్న చిన్న విభాగాల్లో, ఒంటరిగా సాగేదని, ఏజెన్సీలు చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవని అమిత్ షా గుర్తు చేశారు. డ్రగ్స్పై ఈ పోరాటాన్నిజాతీయ భద్రతా ప్రాధాన్యతగా మోడీ ప్రభుత్వంమార్చిందని చెప్పారు.నాలుగు స్థాయిల్లోనార్కో సమన్వయ కేంద్రాలు2019లో నాలుగు స్థాయిల నార్కో సమన్వయ కేంద్రంఏర్పాటు చేశారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోప్రత్యేక మాదకద్రవ్య నిరోధక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటుచేశారు. మాదకద్రవ్య నియంత్రణ బ్యూరోను పునర్వ్యవస్థీకరించి బలోపేతం చేశారు. నిడాన్ పోర్టల్ ద్వారా నేరస్తులజాతీయ డేటాబేస్ సృష్టించారు. 1933 మానస్ హెల్ప్ లైన్‌ప్రారంభించి బాధిత యువతకు పునరావాసం అందిస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు.కార్యాచరణ ప్రణాళిక నాలుగు స్తంభాలపై ఆధారపడిఉంది. మేధస్సు, కార్యాచరణ ఆధారిత అమలు, సింథటిక్‌మాదకద్రవ్యాలు, పూర్వగామి రసాయనాల నియంత్రణ,డిమాండ్ తగ్గింపు, హాని తగ్గింపు, సామర్థ్య నిర్మాణం, సమన్వయం. దిగువ నుంచి పైకి, పై నుంచి కిందికి దర్యాప్తు విధానం అవలంబిస్తున్నారని అమిత్ షా తెలిపారు. చిన్న ప్యాకెట్‌స్వాధీనం చేసుకున్నా మొత్తం నెట్వర్క్ న్ను వెలికితీస్తారు.సరిహద్దుల్లో పెద్ద సరుకు పట్టుకున్నా వినియోగదారువరకు జాడ వెతుకుతారని కేంద్ర మంత్రి చెప్పారు.

# వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువకు సాగునీటి విడుదల

- దిగువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**గాలివీడు మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** గాలివీడు మండలం వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ నుండి దిగువ ఆయకట్టు రైతుల సాగునీటి అవసరాల కోసం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నీటిని విడుదల చేశారు.దిగువ ఆయకట్టులోని రైతుల పంట పొలాలకు సాగునీరు అందించేందుకు 0.5 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. నీటి విడుదలతో దిగువ ప్రాంతాల్లోని కాలువలు, చెరువులు నిండడంతో పాటు రైతుల పంట పొలాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల సంక్షేమం, సాగునీటి వసతుల మెరుగుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# కుటుంబ కలహాల వలన విసిగి వేసారిన మహిళ

- వెలిగల్లు డ్యామ్ వద్ద తల్లీ, ఇద్దరు పిల్లల ఆత్మహత్యాయత్నం భగ్నం
- గాలివీడు ఎస్ఐ నరసింహారెడ్డినీ అభినందించిన ఎస్పీ





**గాలివీడు మన జనప్రగతి సెప్టెంబర్ 06;-** కుటుంబ కలహాల కారణంగా తల్లీ, ఇద్దరు పిల్లలు వెలిగల్లు డ్యామ్ వద్ద ఆత్మహత్యకు యత్నించగా గాలివీడు పోలీసులు సకాలంలో స్పందించి వారి ప్రాణాలను కాపాడారు.శనివారం రాత్రి అందిన సమాచారంతో ఎస్ఐ జె. నరసింహారెడ్డి సిబ్బందితో కలిసి వెంటనే డ్యామ్ వద్దకు చేరుకుని మహిళ, ఇద్దరు పిల్లలను సురక్షితంగా రక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, వారిని బంధువులకు అప్పగించారు.మూడు ప్రాణాలను కాపాడిన ఎస్ఐ నరసింహారెడ్డి, పోలీసు సిబ్బందిని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, అభినందించారు.

# డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించాలి: రాచమల్లు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:-**డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో డీఎస్సీ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని రాచమల్లు తెలిపారు. ఒక్కో ఉద్యోగానికి రూ.20 లక్షల వరకు తీసుకున్నారనే ప్రచారం జరుగుతోందని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. మెరిట్‌కు కాకుండా డబ్బుకు ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు. టెట్ పరీక్ష రాయకుండానే కొందరికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ అంశంపై రాష్ట్ర యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కడప జిల్లాకు చెందిన ఓ మహిళ వినికిడి లోపం ఉన్నట్లు నకిలీ ధ్రువపత్రం సమర్పించి వికలాంగుల కోటాలో ఉద్యోగం పొందారనే ఆరోపణపై విచారణ జరపాలని కోరారు. అలాగే ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురికి పక్కదారి ద్వారా ఉద్యోగాలు ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనని వారికి క్రీడాకారుల కోటాలో ధ్రువపత్రాలు ఇప్పించారనే ఆరోపణలు కూడా ఉన్నాయని, కునా రవి తదితరుల ద్వారా ధ్రువపత్రాల జారీకి సంబంధించి వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని అన్నారు. డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీబీఐ విచారణకు ఆదేశించాలని రాచమల్లు కోరారు. అర్హత, ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ నియామకాలు జరగాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇసుక అక్రమ తవ్వకాలపై సీనియర్ టీడీపీ నేతల ఆగ్రహం

**కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్**

**జేసీబీలతో తవ్వకాలు, టిప్పర్లతో తరలింపు**

**ఇసుక మాఫియాపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి: టీడీపీ నేతలు**



**సిద్ధవటం, మన జనప్రగతి, ఏప్రిల్ 06: -** పెన్నా, చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని టీడీపీ సీనియర్ నేతలు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను నిషేధించినప్పటికీ, అక్రమంగా జేసీబీలతో ఇసుక తవ్వి టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని మండిపడ్డారు. భాకరాపేటలో ఆదివారం టీడీపీ సీనియర్ నేత, మాజీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య నివాసంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మాజీ కల్లుగీత కార్పొరేషన్ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య మాట్లాడారు. పెద్ద యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరపడం వల్ల పెన్నా నదిలో భారీ గుంతలు ఏర్పడుతున్నాయని, అక్రమ రవాణాతో ఇసుక మాఫియా కోట్లాది రూపాయలు ఆర్జిస్తోందని ఆరోపించారు. గృహ నిర్మాణ అవసరాలకు మాత్రమే ఉచితంగా ఇసుక వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ, పెద్ద టిప్పర్ల ద్వారా ఇసుకను దూర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా కారణంగా గ్రామీణ రహదారులు దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చెయ్యేరు నదీ తీరంలో అక్రమ ఇసుక రవాణా వాహనాలను అధికారులు పట్టుకుని భారీగా జరిమానాలు విధించినా, మళ్లీ అదే తరహాలో అక్రమ రవాణా కొనసాగుతోందని విమర్శించారు. రాజంపేట నియోజకవర్గంలో ఇసుక అక్రమాలపై పలు పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. అధికార పార్టీకి చెందినవారిగా ఉన్నప్పటికీ అక్రమాలను అరికట్టలేకపోతున్నామని, ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్టీలో చేరిన కొందరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని అధిష్ఠానాన్ని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నేత పుత్తా రామచంద్రయ్య, కొమర వెంకట నరసయ్య, అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, కిరణ్ స్వామి, సుబ్రహ్మణ్యం, కొండా శ్రీనివాసులు, డాక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ జన్మదినం సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'ను విజయవంతం చేయండి

- భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథం వైపు నడిపిస్తూ 'వికసిత భారత్' లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ పిలుపునిచ్చారు.పులివెందుల భాజపా కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.నరేంద్ర మోదీ 12 ఏళ్ల ముఖ్యమంత్రిగా,దాదాపు దశాబ్దానికి పైగా దేశ ప్రధానిగా నిస్వార్థ ప్రజాసేవ అందిస్తున్నారని కొనియాడారు.దేశ రక్షణ, సార్వభౌమాధికారాన్ని పటిష్టం చేస్తూ విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని,ప్రపంచ యవనికపై భారత్‌ను 'విశ్వగురువు'గా నిలిపేందుకు ప్రధాని అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని,పోలవరానికి నిధుల తోడ్పాటుతో పాటు అమరావతి రాజధాని అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారని తెలిపారు. రాష్ట్రాన్ని విద్యుత్ రంగంలో మిగులు సాధించే దిశగా కేంద్రం ప్రోత్సహిస్తోందని చెప్పారు.రాష్ట్ర సమగ్ర ప్రగతి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుచూపుతో కేంద్రంతో కలిసి సమన్వయంతో సాగిస్తున్న పాలన ప్రశంసనీయమని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వాజపేయి,ఓబీసీ మోర్చా నాయకుడు యుగంధర్,స్థానిక నాయకులు లక్ష్మయ్య,కోడిమూర్తి శ్రీరాములు,తిరుపాల్ రెడ్డి,రక్షిత్ చౌదరి,సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జనసేనలో రవిశంకర్‌కు కీలక బాధ్యత

**కడప పార్లమెంట్ సహాయక బృందం సభ్యుడిగా నియామకం**



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 06:-**జనసేన పార్టీలో వేంపల్లె పట్టణానికి చెందిన దాసరి రవిశంకర్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడంలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కడప, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలకు సమన్వయ కమిటీలను నియమించారు. ఇందులో భాగంగా కడప పార్లమెంట్ సహాయక బృందం సభ్యుడిగా పులివెందుల నియోజకవర్గం వేంపల్లెకు చెందిన దాసరి రవిశంకర్‌ను నియమించారు.ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలను సమన్వయం చేయడంతో పాటు కూటమి భాగస్వామ్య పక్షాలతో క్షేత్రస్థాయిలో సమన్వయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని రవిశంకర్ పేర్కొన్నారు. కడప పార్లమెంట్ పరిధిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని ఎన్నికలకు సన్నద్ధం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. నియమిత సభ్యులకు ఈ నెల 9న ఉదయం 10 గంటలకు మంగళగిరిలో ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రవిశంకర్ వెల్లడించారు.

# వేల్పులలో ఘనంగా రాము జన్మదిన సంబరాలు..

**తల్లి లింగాల పార్వతమ్మ చేతుల మీదుగా కేక్ కట్..**

**రాముపై ప్రత్యేకంగా రూపొందించిన పాట విడుదల**

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న యువత,అభిమానులు**



**వేముల మన జనప్రగతి సెప్టెంబర్ 06:-**వేముల మండలం వేల్పుల గ్రామంలో వైఎస్సార్‌సీపీ వేముల మండల పరిశీలకుడు వేల్పుల రాము జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.వేడుకల్లో భాగంగా రాము తల్లి లింగాల పార్వతమ్మ అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిమానులు రాముకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ..ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.పుట్టినరోజు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా వేల్పుల రాముపై రూపొందించిన ప్రత్యేక పాటను లింగాల పార్వతమ్మ ఆవిష్కరించారు.రాము వ్యక్తిత్వం, ప్రజలతో ఆయనకున్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ పాటను వేడుకల్లో విడుదల చేశారు. పాట ఆవిష్కరణ సందర్భంగా అభిమానులు,యువత ఉత్సాహంగా స్పందించారు.ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ.. రాము ప్రజలతో మమేకమై, గ్రామస్తులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ అందరి ఆదరణ పొందుతున్నారని తెలిపారు.రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ చిన్నప్ప, ఎంపీటీసీ బాబ్జాన్,నాయకులు,అభిమానులు,యువత, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ప్రతి సోమవారం ప్రజలతో కమీషనర్ ముఖాముఖీ!




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రొద్దుటూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే "ప్రజలతో కమీషనర్ ముఖాముఖీ" కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రజలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని కమిషనర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం పనిచేస్తోందని పేర్కొన్నారు.

# ప్రవక్త పుట్టిన నెలలో పేదలకు అన్నదానం



**సిద్దవటం, మన జనప్రగతి, సెప్టెంబర్ 06:–** మహమ్మద్ ప్రవక్త పుట్టిన నెలను పురస్కరించుకొని జనసేన పార్టీ ముస్లిం మైనార్టీ నాయకుడు గౌస్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం గ్యార్మీ ఫాతేహా కార్యక్రమాన్ని నిర్వహించి పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సజ్జాదే నషీన్ పీర్ సయ్యద్ షబ్బీర్ ఆలం ఖాద్రి మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త బోధించిన మార్గంలో ప్రతి ముస్లిం సోదరుడు నడవాలని సూచించారు. ప్రవక్త పుట్టిన నెలలో నిరుపేదలకు అన్నదానం చేసి వారి ఆకలి తీర్చడం అభినందనీయమన్నారు. గౌస్ బాషా మాట్లాడుతూ.. నిరుపేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రవక్త పుట్టిన నెలను పురస్కరించుకొని కడుపునిండా భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్ధవటం మాజీ సర్పంచ్ ఓబులయ్య, ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్ బాషా, కరీముల్లా, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ప్రజా భద్రతపై విస్తృత అవగాహన



**అన్నమయ్య బ్యూరో మన జన ప్రగతి సెప్టెంబర్ 06 :–** ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో పోలీసులు జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో రాత్రి బస చేస్తూ ప్రజా భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనతో పాటు హెల్మెట్ వాడకం, రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యపరుస్తున్నారు. రాబోయే వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై కమిటీలకు సూచనలు చేయడంతో పాటు, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని వారు కోరారు.

# డా. పోలిరెడ్డికి ఘన పురస్కారం

**డోన్ మన జన ప్రగతి సెప్టెంబర్ 06 :–** ఫార్మసీ విద్యాభివృద్ధికి విశిష్ట సేవలందిస్తున్న నలందా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్, ప్రిన్సిపాల్ డా. పాపగట్ల పోలిరెడ్డికి ప్రతిష్ఠాత్మక ప్రో. ఎం ఎల్ ష్రాఫ్ ఫార్మా రికగ్నేషన్ అవార్డు లభించింది. ఫార్మసీ విద్యారంగంలో ఆయన చూపుతున్న అంకితభావం, దూర దృష్టితో కూడిన నాయకత్వం, విద్యాభివృద్ధికి చేస్తున్న విలువైన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న నిర్వహించిన నేషనల్ వెబినార్ అండ్ ఫెలిసిటేషన్ సెర్మని 2026లో ఫార్మలోక్ సంస్థ డా. పోలిరెడ్డిని ఘనంగా సత్కరించి ఈ అవార్డును ప్రదానం చేసింది. హానరింగ్ ఎడ్యుకేటర్స్ ఎంపోరింగ్ ట్రాన్స్ఫార్మింగ్ ఫార్మసీ ఎడ్యుకేషన్ అనే థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫార్మసీ విద్యారంగంలో మార్గదర్శకంగా నిలుస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కిందని నిర్వాహకులు తెలిపారు.

# గణపతి నవరాత్రుల నిర్వహణకు రాట ముహూర్తం



**కాకినాడ,మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** కాకినాడ స్థానిక ప్రతాప్‌నగర్ బోర్డు వద్ద ప్రతి ఏడాది నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలను ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు ఆదివారం రాట ముహూర్తం నిర్వహించారు. 41వ డివిజన్ ప్రజలతో కలిసి పోలవరపు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సివిల్ సప్లై డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య ముఖ్యఅతిథిగా హాజరై రాట ముహూర్తం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరపు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, తన చిన్నతనం నుంచి ప్రతాప్‌నగర్ బోర్డు వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను ఈ ఏడాది 41వ డివిజన్ ప్రజల సహకారంతో మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణపతి నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బుదిరెడ్డి రాజు (డిస్కో రాజు), జొన్నాడ వెంకటరమణ, వాసిరెడ్డి సత్యకుమార్, విద్యాసాగర్, కోకా సత్తిబాబు, పళ్ళ శ్రీనివాస్, గుడిమెట్ల స్వామి, కాకర ధనలక్ష్మి, చింతల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలకు ముందస్తు పోలీస్ అనుమతి తప్పనిసరి

**- అనుమతులు లేకుండా విగ్రహాల ప్రతిష్ఠ చట్టవిరుద్ధం: ఎస్సై హారిక**



**సిద్ధవటం, మన జనప్రగతి, సెప్టెంబర్ 06:–** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సిద్ధవటం ఎస్సై హారిక సూచించారు. అనుమతులు లేకుండా విగ్రహాలను ప్రతిష్ఠించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఆదివారం సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ.. కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలన్నారు. మండపాల వద్ద డీజేలకు ఎటువంటి అనుమతులు ఉండవని, నిర్వాహకులు ముందస్తుగా డీజేలకు అడ్వాన్సులు ఇచ్చి డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. మండపాల వద్ద భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ లైన్లకు దూరంగా మండపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలీస్ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే గణేష్ విగ్రహాల నిమజ్జనం నిర్వహించాలని, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై కోరారు. మండలంలోని 18 గ్రామపంచాయతీల పరిధిలో వినాయక ఉత్సవాలకు డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. అనవసర గొడవలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

# కల్లూరులో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం


**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** ప్రొద్దుటూరు మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో శ్రీ సీతా సమేత శ్రీరామచంద్ర స్వామి, లక్ష్మణ స్వామి, ఆంజనేయస్వామి సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని ఆలయ అభివృద్ధి, గ్రామ ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నంద్యాల ఆనంద్ భార్గవ్ రెడ్డి, లింగాపురం ఏజీఆర్ బ్యాంకు చైర్మన్ సిద్ధారెడ్డి నాగముని రెడ్డి, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి చైర్మన్ పట్నం లక్ష్మణ్ కుమార్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కల్లూరు గ్రామ నాయకులు నిరంజన్ రెడ్డితో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జయమ్మ కాలనీలో ఘనంగా శ్రీ గణేశ్ ఆలయ ప్రారంభోత్సవం

**- విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న వైఎస్ మనోహర్ రెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** జయమ్మ కాలనీలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సహకారం, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మరియు గ్రామస్థుల సంయుక్త చొరవతో నూతనంగా నిర్మించిన శ్రీ గణేశ్ దేవాలయాన్ని పార్టీ మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. నాయకులు,స్థానిక ప్రజల సమన్వయంతో కాలనీలో ఆధ్యాత్మిక కేంద్రాన్ని నిర్మించడం ఎంతో అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. వినాయకుని కృపాకటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్,రసూల్,పట్టణ అధ్యక్షులు హాల్ గంగాధర్ రెడ్డి,పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్,నాయకులు కోడి రమణతో పాటు స్థానిక ప్రజలు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**కాకినాడ,మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** కాకినాడ జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికయింది అధ్యక్షుడిగా నున్న రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాకినాడలోని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ లో జరిగిన సమావేశంలో హాజరైన సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామకృష్ణతోపాటు ఉపాధ్యక్షులుగా పేకేటి నాగేశ్వరరావు, కొయ్య శ్రీనుబాబు, సంయుక్త కార్యదర్శిగా కొత్త బైరవకృష్ణ, కోశాధికారిగా పెద్దిరెడ్డి రామాంజనేయ (బాబి)తో కూడిన కార్యవర్గాన్ని సుమారు 123 మంది సభ్యుల హాజరై ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థకు పంపిణీ చేసే బియ్యాన్ని జిల్లా నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక అవడం ఆనందంగా ఉందన్నారు. కాకినాడ పోర్టులో ఎటువంటి అక్రమాలు జరగకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుందన్నారు. ఒకరిద్దరు చేస్తున్న తప్పుల వల్ల అసోసియేషన్ లోని మిల్లర్ల పైన తప్పుడు సంకేతం వెళ్తుందన్నారు. పోర్టులో బొండం బియ్యం, పచ్చి నూకలు మాత్రమే మాత్రమే ఎగుమతి జరుగుతున్నాయని చెప్పారు. మిల్లర్ల సంక్షేమానికి తన వంతు ఎనలేని కృషి చేస్తానని రామకృష్ణ చెప్పారు. ఈ సందర్భంగా రామకృష్ణను పలువురు మిల్లర్లు అభినందలు తెలిపి శాలువాలతో సత్కరించారు.

# పారిశుద్ధ్య కార్మికురాలిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు



**ఆదోని మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** ఆదోని కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఒక అమానవీయ ఘటన తీవ్ర కలకలం రేగింది. ఆదివారం తెల్లవారుజామున విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలిపై గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత కిరాతకంగా దాడి చేసి, పెట్రోల్ పోసి సజీవదహనానికి యత్నించారు. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదోని మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న నర్సమ్మ (30) ఆదివారం తెల్లవారుజామున స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రోడ్డు ఊడ్చే పనిలో నిమగ్నమైంది. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న గుర్తుతెలియని మహిళలు ఒక్కసారిగా ఆమెపై దాడికి దిగారు. తప్పించుకునే అవకాశం లేకుండా ఆమె కళ్లలో కారం కొట్టి, వెంటనే వెంట తెచ్చుకున్న పెట్రోల్ ఆమెపై పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యారు. నర్సమ్మ కేకలు వేయడంతో గమనించిన స్థానికులు, తోటి కార్మికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పేశారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను 108 అంబులెన్స్‌లో హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నర్సమ్మ భర్త రెండేళ్ల క్రితమే మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె మున్సిపల్ కాంట్రాక్ట్ పని చేస్తూ తన ముగ్గురు పిల్లలను పోషించుకుంటోంది. పిల్లలకు పెద్దదిక్కుగా ఉన్న ఆ తల్లిపై ఇలాంటి కిరాతక దాడి జరగడంతో కుటుంబసభ్యులు,తోటి కార్మికులు కన్నీరుమున్నీ రవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించా రు. గాయపడిన నరసమ్మను మున్సిపల్ కమిషనర్ పరామర్శించారు. ఈ దాడి వెనుక ఉన్న కారణాలు ఏంటి? పాత కక్షలా లేక మరేదైనా వివాదమా? అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా రు. నిందితుల గుర్తింపు కోసం పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికురాలిపై జరిగిన ఈ దారుణ ఘటనతో పట్టణంలో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రొద్దుటూరులో రూ.12 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం!

**- పలు వార్డుల్లో రోడ్లు, కాలువల పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రొద్దుటూరు పురపాలక పరిధిలోని పలు వార్డుల్లో రూ. 12 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆదివారం భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు, కాలువల నిర్మాణం, అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, షేక్ కార్పొరేషన్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డి, పురపాలక కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, పురపాలక ఇంజనీర్ శ్రీనివాసులు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జబీబుల్లా, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, స్థానిక కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేశ్వర్‌ను పరామర్శించిన వైఎస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** పులివెందుల బలిజ సంఘం నేత సర్వేశ్వర్‌ను మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల సర్వేశ్వర్ కాలికి శస్త్రచికిత్స చేయించుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మనోహర్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు వరప్రసాద్,పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్,మాజీ కో–ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి తదితరులతో పాటు పలువురు బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక


07- 09 - 2026

# ఏపీ రెవిన్యూ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక



**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 06:–**ఏపీ రెవిన్యూ అసోసియేషన్ కాకినాడ జిల్లా నూతన కార్యవర్గశీ ఎన్నికల ఆదివారం కాకినాడ రెవెన్యూ అసోసియేషన్ (ముద్దాడ రవిచంద్ర రెవెన్యూ భవనంలో) జరిగింది. అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు పితాని త్రినాథరావు పర్యవేక్షణలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా సామర్లకోట మండల తహశీల్దార్ కె చంద్రశేఖర రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా డి కృష్ణ, ఉపాధ్యక్షులుగా జేవీఆర్ రమేష్, కె సాయి కిరణ్, కెఎస్వీ సుబ్బారావు, మహిళా ఉపాధ్యక్షురాలుగా ఎన్ చందన, కార్యదర్శిగా ఎస్ రామమోహన్, నిర్వాహక కార్యదర్శిగా ఎమ్టీఆర్ ప్రసాద్, క్రీడా విభాగ కార్యదర్శి డిఆర్కే రాజు, జాయింట్ సెక్రటరీలుగా డి దుర్గా ప్రసాద్, వి గోపి, వై యమునా సత్య నాగినీ దేవి, ఎస్ చిన పాపారావు, కోశాధికారిగా కె వీరబాబు, ఈసీ మెంబర్స్ పి సుబ్బారావు, పి సత్య శ్రీకాంత్, ఎస్ఆర్ఆర్ చంద్రశేఖర్, ఐవి రఘు తేజ, వి మనోహర్ రాజులు ఎంపికయ్యారు.నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షుడు పితాని త్రినాథరావు మాట్లాడుతూ అసోసియేషన్ ఉద్యోగులకు అండగా, ఉపయోగ పడేలా ఉండాలని, ఉద్యోగి కష్టంలో ఉన్నపుడే అసోసియేషన్ అవసరం ఉంటుందన్నారు.తాను దాదాపు 20 సంవత్సరాలు అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. అసోసియేషన్ భవనం నిర్మాణం, ఆర్థికంగా బలోపేతానికి చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. సాంబమూర్తి నగర్లో రెవిన్యూ స్థలం ఆక్రమణలకు సిద్ధంగా ఉందని దానిని కాపాడుకోవాలన్నారు. అందరూ సోదరులుగా నిబంధనలు పాటిస్తూ పనిచేయాలని సూచించారు. అసోసియేషన్కు ఉన్న ఆస్తులు కాపాడాలని, సంఘానికి సేవ చేసే వారిని మరవకుండా వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించుకోవద్దని హితవు పలికారు. జెఏసి మాజీ ఛైర్మన్ బూరిగ ఆశీర్వాదం తదితరులు ప్రసంగించారు. అందరి సహకారంతో అసోసియేషన్ కార్యకలాపాలు సమర్ధవంతంగా నిర్వహిస్తామని నూతన కార్యవర్గం హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. ఎన్నికలకు వివిఎస్ దివాకర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు

# నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన సుగవాసి ప్రసాద్ బాబు



**రాయచోటి స్టాప్ రిపోర్టర్ జనప్రగతి సెప్టెంబర్ 06:–** రాయచోటి పట్టణంలో దేరంగుల వారి నూతన గృహప్రవేశ వేడుక రాయచోటి పట్టణంలోని కె రామాపురం, సందీప్ స్కూల్ సమీపంలో దేరంగుల రాఘవ నూతనంగా నిర్మించిన గృహంలో ఆదివారం నిర్వహించిన గృహప్రవేశ వేడుకకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు హాజరై నూతన గృహ యజమానులను ఆత్మీయంగా పలకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ప్రశాంతత, శాంతి సమృద్ధిగా ఎల్లప్పుడూ నెలకొనాలని ఆకాంక్షించారు.ప్రతి కుటుంబానికి సొంతింటి కల ఎంతో ప్రత్యేకమైనదని, ఆ కల సాకారం చేసుకుని నూతన గృహంలోకి అడుగుపెడుతున్న దేరంగుల రాఘవ గారి కుటుంబానికి ఈ కొత్త ఇల్లు ఆనందాలకు, ఆత్మీయతలకు, అభివృద్ధికి వేదిక కావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. శ్రీరామచంద్ర స్వామి వారి మరియు శ్రీ సత్యనారాయణ స్వామి వారి దివ్య ఆశీస్సులతో ఈ కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాభివృద్ధులతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు.

# అనంతపురమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



**చిట్వేలి. మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** చిట్వేలి మండలంలోని తిమ్మయ్యగారిపల్లెలో శ్రీ అనంతపురమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ బాధ్యులు ముక్కా రూపానంద రెడ్డి, టిడిపి నాయకురాలు ముక్కా వరలక్ష్మి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా వేదపండితులు, పూజారులు ప్రత్యేక పూజలు, మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానంద రెడ్డి, ముక్కా వరలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనంతపురమ్మ తల్లి కృపాకటాక్షాలతో తిమ్మయ్యగారిపల్లె గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే నూతన ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని అమ్మవారిని ప్రార్థించారు. నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరగడంతో గ్రామ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయం పూర్తయిన అనంతరం గ్రామానికి మరింత ఆధ్యాత్మిక శోభ చేకూరుతుందని, వివిధ పండుగలు, జాతరలు, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# వైద్యుల రక్తదానం అభినందనీయం

● రక్తదానం ద్వారా ప్రాణదాతలుగా నిలవాలి



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** సమాజంలో ప్రాణాలను కాపాడే బాధ్యతను నిర్వర్తిస్తున్న వైద్యులు స్వయంగా రక్తదాతలుగా ముందుకు రావడం అభినందనీయమని జేబీవీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు ఎం.అశోక్ అన్నాడు. కడప మరియు అన్నమయ్య జిల్లాల స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త వారోత్సవాల్లో మూడవ రోజు నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కడప రిమ్స్ బ్లడ్ బ్యాంక్ లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రక్తం అవసరమైన సమయంలో అందుబాటులో ఉండేలా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని, ముఖ్యంగా వైద్యులు రక్తదానం చేయడం ద్వారా యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మరోఅతిథిగా పాల్గొన్న రిమ్స్ బ్లడ్ బ్యాంక్ టెక్నికల్ సూపర్వైజర్ గోపిరెడ్డి విశ్వనాధ్ రెడ్డి మాట్లాడుతూ రోగుల ప్రాణాలను కాపాడటం వైద్యుల వృత్తి బాధ్యత అయితే, అవసరమైన వారికి రక్తం అందించడం వారి మానవతా బాధ్యత అని తెలుపుతూ వారి సేవా స్ఫూర్తి మరింత మంది యువతను రక్తదానం వైపు నడిపించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ విద్యార్థి ప్రముఖ సాయి ఈశ్వర్ మాట్లాడుతూ రక్తదానం విషయంలో ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, శాస్త్రీయ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మరియు రక్తం అవసరమైన ప్రతి సందర్భంలో రక్తదాతలు అందుబాటులో ఉండేలా ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందంటూ కార్యక్రమంలో రక్తదానం చేసిన రక్తదాతలకు రిఫ్రెష్మెంట్ అందజేసిన సంద్రం క్యాలిఫోర్నియాలో నివసిస్తున్నటువంటి ఆకుమల్ల సహస్రకు అభినందనలు తెలియజేశారు . ఎన్.ఎం.ఓ సభ్యులు సాయిచంద్ సాయినాథ్ మణిశంకర్ నిఖిల్, జేబీవీఎస్ సభ్యులు వీరాచారి, సూర్య, జస్వంత్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# దంత సమస్యలకు ఆధునిక వైద్యం. ఐవిఓఆర్వైలో సమగ్ర డెంటల్ సేవలు



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చిన్న వయసు నుంచే అనేక రకాల దంత సమస్యలు ఎదురవుతున్నాయి. పంటి నొప్పి, చిగుళ్ల సమస్యలు, పళ్లపై గార పట్టడం, పళ్లు వంకరగా ఉండటం, పళ్లు దెబ్బతినడం, పళ్లు కోల్పోవడం వంటి సమస్యలకు సకాలంలో సరైన వైద్య చికిత్స తీసుకోవడం ఎంతో అవసరం అని డాక్టర్ సాయి తేజ తెలిపారు.ఆదివారం ఉదయం రాజీవు పార్కు దగ్గర సోనోవిజన్ ఎదురుగా ఐ వి ఓ ఆర్ వై. డెంటల్ హాస్పిటల్ ను ప్రారంభించారు. మా అందరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దంత వైద్య సేవలను అందించేందుకు ప్రత్యేకంగా సేవలు అందుబాటులో ఉన్నట్లు డాక్టర్ సాయి తేజ తెలిపారు. రోగి సమస్యను ముందుగా తెలుసుకుని, అవసరమైన పరీక్షలు నిర్వహించి, చికిత్సకు సంబంధించిన వివరాలను స్పష్టంగా తెలియజేసే విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపింది. **పంటి నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు** చాలామంది పంటి నొప్పి వచ్చినప్పుడు తాత్కాలికంగా మందులు వాడుతూ సమస్యను వాయిదా వేస్తుంటారు. అయితే దంత సమస్యలను ప్రారంభ దశలోనే వైద్యుల ద్వారా పరీక్షించుకోవడం ద్వారా సమస్య తీవ్రతను తగ్గించుకునే అవకాశం ఉంటుంది. సాధారణ దంత పరీక్షలతో పాటు అవసరమైన చికిత్సను వైద్యుల సూచన మేరకు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.**వివిధ రకాల దంత చికిత్సలు**దంత వైద్య రంగంలో పళ్ల అమరిక సరిచేయడం, పళ్లు కోల్పోయిన వారికి దంతాలను పునరుద్ధరించడం, క్రౌన్స్, బ్రిడ్జెస్, డెంటర్స్, ఇంప్లాంట్ సంబంధిత చికిత్సలు, వెనియర్స్, స్మైల్ డిజైనింగ్ వంటి పలు రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. పళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడంతో పాటు చిరునవ్వులో ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా అవసరమైన చికిత్సను అందించడమే లక్ష్యంగా సేవలు కొనసాగుతున్నట్లు డాక్టర్ సాయి తేజ తెలిపారు**క్రమం తప్పకుండా దంత పరీక్షలు అవసరం** పంటి నొప్పి లేదా ఇతర సమస్యలు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా, క్రమం తప్పకుండా దంత వైద్యులను సంప్రదించి నోటి ఆరోగ్యాన్ని పరీక్షించుకోవడం మంచిదని వైద్య రంగ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, యువత, వృద్ధులు నోటి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెబుతున్నారు. మా వైద్య సేవలను కడప జిల్లా ప్రజలు చేసుకోవాలని డాక్టర్లు తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్లు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు

# నిరుద్యోగుల భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం చెలగాటం

● వైఎస్సార్సీపీ పులివెందుల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి డిమాండ్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** మెగా డీఎస్సీ ఎంపిక ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని,ప్రభుత్వం చెబుతున్నట్లు అంతా పారదర్శకంగానే ఉంటే సీబీఐ దర్యాప్తుకు ఆదేశించడానికి ఎందుకు భయపడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి ప్రశ్నించారు. నిరుద్యోగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆయన మండిపడ్డారు.పులివెందులలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామ్ లక్ష్మణ్ రెడ్డి మాట్లాడారు.డీఎస్సీ ప్రక్రియపై అభ్యర్థుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేస్తూ పలు అంశాలను ప్రస్తావించారు.నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని పలువురు అభ్యర్థులకు ఉద్యోగాలు కట్టబెట్టారంటూ స్పష్టమైన ఫిర్యాదులు వస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమని అన్నారు.రిక్రూట్మెంట్లో జరిగిన లోపాలకు పూర్తి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.టెట్ మార్కుల పరిశీలన,స్పోర్ట్స్ కోటా కేటాయింపులు,ధ్రువపత్రాల పరిశీలన,తుది మెరిట్ జాబితా నుంచి పోస్టింగ్ ఆర్డర్ల వరకు జరిగిన ప్రతి అడుగుపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందన్నారు.దరఖాస్తు దశలోనే తిరస్కరించాల్సిన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయి పోస్టింగ్ల వరకు ఎలా చేరుకున్నారని ప్రశ్నించారు.స్థానిక అధికారులతో నామమాత్రపు విచారణ జరిపి చేతులు దులుపుకోకుండా స్వతంత్ర సంస్థ అయిన సీబీఐకే కేసు అప్పగించాలని డిమాండ్ చేశారు.ఏళ్ల తరబడి రేయింబవళ్లు శ్రమించి పరీక్షలు రాసిన నిజాయితీపరులైన నిరుద్యోగులకు అన్యాయం జరగనివ్వబోమని,బాధిత అభ్యర్థుల తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తుందని రామ్ లక్ష్మణ్ రెడ్డి స్పష్టం చేశారు.

# మేళ్లచెరువు నైమిశారణ్య ఆశ్రమానికి రక్షణ కల్పించాలి



**పీలేరు,మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** పీలేరు మండలం మేళ్లచెరువు గ్రామంలోని నైమిశారణ్య ఆశ్రమం (మహర్షి చారిటబుల్ ట్రస్ట్)కు రక్షణ కల్పించాలని ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు కోరారు. కొందరు వ్యక్తులు ఆశ్రమానికి వచ్చి నిర్వాహకులు, భక్తులతో గొడవలకు దిగుతూ దుర్భాషలాడటం, బెదిరించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తున్నారని పీలేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈ ఘటనలతో ఆశ్రమానికి వచ్చే మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఆశ్రమ వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటూ సమస్యలు సృష్టిస్తున్న వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆశ్రమ నిర్వాహకులు, భక్తులకు భద్రత కల్పించి, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వధూవరులను ఆశీర్వదించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి స్టాప్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:** చిన్నమండెం మండలంలో రెడ్డిబాషా కుమార్తె వివాహ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అన్యోన్యతతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మండిపల్లి అభిమానులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# కోడి పందెం రాయుళ్ల అరెస్ట్ నగదు స్వాధీనం: ఎస్సై తిరుపాల్ నాయక్



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** మండలం లోని టీ. వెలమవారిపల్లె గ్రామ సమీపంలోని మామిడి తోట వద్ద ఆదివారం కోడిపందాలు ఆడుతున్న అజీజ్, భాస్కర్ మరో నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ 22,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తిరుపాల్ నాయక్ తెలిపారు. పట్టణ సిఐ నరసింహులు ఆదేశాల మేరకు ముందుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కోడిపందాలపై దాడులు చేయగా వేముల మండలం మబ్బుచింతలపల్లి చెందిన అజీజ్,భాస్కర్, పెండ్లిమర్రి మండలం నంది మండలం గ్రామానికి చెందిన మరో నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి నగదు తో పాటు ఓ కోడిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలియజేశారు. పట్టుబడ్డవారిని పులివెందుల న్యాయస్థానంలో హాజరు పరుస్తామని ఎస్సై తెలియజేశారు.

# నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07- 09 - 2026

# వైకాపా కార్యకర్తలకు అండగా ఉంటాం

### - జడ్పిటిసి సభ్యుడు రవికుమార్ రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** వైకాపా కార్యకర్తలకు అండగా ఉంటామని జెడ్పిటిసి సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కత్తులూరు పంచాయతీ తాటిమాకుల పల్లెలో ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న వైకాపా కార్యకర్త వెంకటసుబ్బయ్య ను ఆదివారం జడ్పిటిసి రవి పరామర్శించారు. ఆయన యోగక్షేమాల గురించి విచారించారు. వైకాపా.కు కార్యకర్తలే బలమని, వారికి వైయస్ కుటుంబం, తాము అండగా ఉంటామన్నారు.కత్తులూరు మాజీ సర్పంచి ఆర్ ఎల్ వి ప్రసాద్ రెడ్డి, తాటిమాకుల పల్లె గురివిరెడ్డి ఆశ్రమ కమిటీ చైర్మన్ పివి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి: కమిషనర్ జయకృష్ణ




**తిరుపతి మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సెప్టెంబర్ 7వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227 208 కి కాల్ చేసి మాట్లాడవచ్చుని తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## సున్నపురాళ్లపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన



**రాజంపేట మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** జిల్లా ఎస్.పి. షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా రాజంపేట పోలీస్ స్టేషన్ ఎస్.ఐ వెంకటేష్ రాజంపేట మండలంలోని సున్నపురాళ్లపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు భద్రత, మహిళల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల మోసపూరిత కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, హెల్మెట్ ధరించి, వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 లేదా డయల్ 112కు సమాచారం అందించాలని, ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులను సంప్రదించాలని ఎస్.ఐ. వెంకటేష్ సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

# వైభవంగా ముగిసిన మైసమ్మ తిరుణాల



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** చిట్వేలి మండలం లోని కే.ఎస్. అగ్రహారం గ్రామంలో ఐదు రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మైసమ్మ తిరుణాల ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఐదు రోజుల పాటు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, చివరి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తిరణాలలో భాగంగా చివరి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా జంతుబలులు సమర్పించి, పొంగుబాలు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలపై అమ్మవారి కృప ఉండాలని భక్తులు ప్రార్థించారు. తిరుణాలను పురస్కరించుకుని కే.ఎస్. అగ్రహారం తో పాటు సమీప గ్రామాల్లోని బంధుమిత్రులను ఆహ్వానించి పలువురు కుటుంబాలు ప్రత్యేకంగా విందు భోజనాలు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. బంధువులు, స్నేహితుల రాకతో పండుగ కళ సంతరించుకుంది. ఆలయానికి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, మొక్కుబడులు పూర్తి చేసుకున్న అనంతరం పూజారుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఐదు రోజుల పాటు ఎలాంటి ఆటంకాలు లేకుండా తిరుణాల ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో గ్రామస్తులు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా కనిపించాయి.

# వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువకు నీటి విడుదల

### - ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలి: మంత్రి మండిపల్లి



**అన్నమయ్య జిల్లా బ్యూరో,మన జనప్రగతి: సెప్టెంబర్ 06:-** అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 15 రోజుల అనంతరం 80 క్యూసెక్కుల చొప్పున కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాగునీరు, పశువుల అవసరాలు, భూగర్భ జలమట్టం పెంపుదలకే నీటికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. చెరువులను గరిష్టంగా 30 శాతం వరకు మాత్రమే నింపుతామని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాజెక్టు నీటిని నమ్ముకుని అధిక నీటి అవసరమయ్యే పంటలు సాగు చేయవద్దని సూచించారు. లిఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలనిలి మంత్రి విజ్ఞప్తి చేశారు. నీటి కొరతతో పంటలు నష్టపోయిన రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ పర్యటన

- మెగా జాబ్ మేళా, యోగా సెంటర్ ప్రారంభం
- ఓబీసీ సమావేశంలో పాల్గొననున్న మంత్రి



**ధర్మవరం,మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ధర్మవరం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. సెప్టెంబర్ 8న ఉదయం 10 గంటలకు ధర్మవరం పట్టణంలోని సిఎన్‌బి కళ్యాణ మండపంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే లిమెగా జాబ్ మేళాలోలి మంత్రి పాల్గొంటారు. నిరుద్యోగ యువతకు వారి విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 9న ఉదయం 9 గంటలకు కళాజ్యోతి సర్కిల్ వద్ద మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన యోగా సెంటర్‌ను మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు గొట్లూరు గ్రామంలో నిర్వహించే ఓబీసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని సంక్షేమం, అభివృద్ధి అంశాలపై చర్చించనున్నారు. మంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# వాహన తనిఖీలు.. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



**నందలూరు మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశాల మేరకు, నందలూరు ఎస్.ఐ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో నందలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అగ్రికల్చర్ చెక్‌పోస్ట్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సం దర్భంగా వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ వినియోగం తదితర అంశాలను పరిశీలించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో సీట్‌బెల్ట్ వినియోగించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రమాదాలను నివారించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు.

# కస్తూర్బా గాంధీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



**సుండుపల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** సుండుపల్లి మండల కేంద్రం సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్సీ భూమిరెడ్డి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి , టీడీపీ నాయకులు చప్పిడి మహేష్ నాయుడు తో కలిసి పరిశీలించారుఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, రుచితో పాటు మెనూ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను గురించి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు విద్య, వసతి, మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పథకాల అమలులో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటిలో ఘర్షణ ఘటనపై ఇరువర్గాలపై కేసులు

- నలుగురికి కౌన్సెలింగ్
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు




**రాయచోటి స్టాప్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ప్రాంతంలో మోటార్‌సైకిల్ దగ్ధం ఘటనపై తలెత్తిన వివాదం అనంతరం బస్టాండ్ వద్ద జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.వి. చలపతి తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, సంబంధిత నలుగురు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా గొడవలకు పాల్పడినా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివాదాలు తలెత్తినప్పుడు ప్రజలు స్వయంగా ఘర్షణలకు దిగకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

# డిగ్రీ ప్రవేశాల జాప్యాన్ని నివారించాలి

### తరగతులు వెంటనే ప్రారంభించాలి: పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న



**కడప మన జనప్రగతి, సెప్టెంబర్ 06:-** డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా వెంటనే తరగతులు ప్రారంభించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడపలోని పీడీఎస్‌యూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడి నాలుగు నెలలు గడిచినా డిగ్రీ ప్రవేశాలు పూర్తికాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. వెంటనే కౌన్సెలింగ్ పూర్తి చేసి పారదర్శకంగా సీట్ల కేటాయింపు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేసి, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల హక్కుల కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల నాయకులు మనోజ్, మహేష్, పండు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద యువతి వివాహానికి ఎఐహెచ్ఆర్ పిసి సేవా కార్యక్రమం



**పులివెందుల, టౌన్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:-** నిరుపేద యువతి వివాహం సందర్భంగా అల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ (ఎఐహెచ్ఆర్ పిసి ) ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ వరప్రసాద్, విలేకరి రమేష్ పాల్గొన్నారు. వారు వివాహానికి హాజరైన పెళ్లికొడుకు, పెళ్లికూతురు కుటుంబ సభ్యులు, బంధువులు, అతిథులకు స్వయంగా బిర్యానీ వడ్డించి సేవలందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన ఎఐహెచ్ఆర్ పిసి నిర్వాహకులు, సభ్యులను అభినందించారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఎఐహెచ్ఆర్ పిసి నేషనల్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ పీరా, రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ సెల్ ప్రతినిధి షేక్ మహమ్మద్ అక్రం హుస్సేన్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ షేక్ మాబు సుభాన్, కడప జిల్లా చైర్మన్ షేక్ మహమ్మద్ నజీర్, రాష్ట్ర యాంటీ కరప్షన్ సెల్ ఇన్‌చార్జ్ షేక్ మహమ్మద్ షకీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు షాహుల్, షరీఫ్, సతీష్, వంశీ, రాకేష్, కృతిక్, జ్ఞాని, రక్షిత్, లోకేష్ తదితరులు పాల్గొని సేవలందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# రెడ్‌క్రాస్ ప్రాణమ్ సెంటర్‌లో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

**హనుమకొండ,మన జనప్రగతి సెప్టెంబర్ 06:**స్థానిక రెడ్‌క్రాస్ ప్రాణమ్ సెంటర్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. కొమురయ్య పెండ్యాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బూర రామచందర్ సంధానకర్తగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, గురువుల మార్గదర్శకత్వంలోనే తాను వైద్యుడిగా స్థిరపడ్డానని గుర్తు చేసుకుంటూ తన చిన్ననాటి ఉపాధ్యాయులకు ప్రణామాలుర్పించారు. సభాధ్యక్షులు కొమురయ్య పెండ్యాల మాట్లాడుతూ.. భారత రత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప తత్వవేత్తగా, దేశ రెండో రాష్ట్రపతిగా అందించిన సేవలు అమోఘమని, ఉపాధ్యాయ లోకానికి ఆయన సదా ఆదర్శనీయులని పేర్కొన్నారు.గురు పూజోత్సవం రోజున విద్యారంగానికి సేవలు అందించిన 12 మంది సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. టీచర్స్ డే సందర్భంగా నిర్వహించిన క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో విజేతలైన వి. అశోక్ రెడ్డి, వి. సాంబయ్య (విన్నర్స్), బూర రామచందర్, రంగరాజు గోవర్ధన్ (రన్నర్స్)లకు ముఖ్య అతిథి చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు.





సెంటర్‌కు రిటైర్డ్ ఎమ్ఆర్ఓ పి.వి. శ్రీనివాసరావు రెండు క్యారమ్ బోర్డుల సెట్లను, రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్ఐ మట్టపల్లి భిక్షపతి ఒక క్యారమ్ బోర్డు సెట్‌ను స్ట్రైకర్, లైట్ డూమ్ లు స్వచ్ఛందంగా విరాళంగా ప్రకటించారు. దాతలకు కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గిరబోయిన రాజేందర్ ధన్యవాద సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో దాదాపు 65 మంది సీనియర్ సిటిజన్లు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

---

# ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**● రక్తదాన శిబిరం, అమ్మవారి విగ్రహం బహూకరణ**



**హనుమకొండ,మన జనప్రగతి సెప్టెంబర్ 06:** హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలను ఇనగాల యువసేన, కాంగ్రెస్ నాయకులు గుడెప్పాడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కి అమ్మవారి విగ్రహాన్ని బహూకరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇనగాల యువసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొజ్జ భాను, మాజీ ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్, నాయకులు కుక్కల జగపతి, మైదానం ప్రవీణ్, దాసరి నరేష్, చెక్క రంజిత్, కుక్కల వినయ్, కొమ్ముల వంశీ, ఎండి. యాఖూబ్, గునిగటి సునీల్, ఎన్ ఎస్ ఆర్ తదితరులు పాల్గొన్నారు.

# జీవనశైలితో.. పోరాటం

**ఒకప్పుడు స్వచ్ఛమైన ఆహారం.. నేడు విషతుల్యమైన ఆహారం**

**కష్టార్జితమంతా.. ఆరోగ్యాన్ని కొనుక్కోవడానికేనా?**

**గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య**

**కల్లూరు,మన జనప్రగతి సెప్టెంబర్ 06:**ఒకప్పుడు ప్రకృతి ఆధారిత పద్ధతుల్లో పండించిన పంటలు, ఇంటి వంటకాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ పండ్లతో ప్రజల జీవనం ఆరోగ్యంగా ఉండేదని ప్రస్తుతం ఆధునిక జీవనశైలి, రసాయనాల వినియోగం, ప్రాసెస్డ్ ఫుడ్, శారీరక శ్రమ తగ్గిపోవడంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య అన్నారు.ప్రస్తుత పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ మన పూర్వీకులు ఏం తిన్నారు మనం ఏం తింటున్నాం అనే విషయాన్ని ఒక్కసారి ఆలోచిస్తే మార్పింటో అర్థమవుతుందన్నారు. వ్యవసాయం వ్యాపారంగా మారడంతో అధిక దిగుబడుల కోసం రసాయనాల వినియోగం పెరిగిందన్నారు. మరోవైపు ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్, అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహారంతో పాటు శారీరక శ్రమ తగ్గడం, నిద్రలేమి, ఒత్తిడి అనారోగ్యానికి కారణమవుతున్నాయని పేర్కొన్నారు.**వ్యాధి వచ్చిన తర్వాత పరుగులు ఎందుకు?**ఆరోగ్యం దెబ్బతిన్న తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరగడం కంటే ముందుగానే జీవనశైలిని మార్చుకోవడం ముఖ్యమన్నారు. స్థానికంగా లభించే తాజా ఆహారం, ఇంటి వంట, నిత్య వ్యాయామం, తగినంత నిద్ర, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం నేలను కాపాడితే నేల మనల్ని కాపాడుతుంది. స్వచ్ఛమైన ఆహారం ఆరోగ్యానికి రక్షణ. ఆరోగ్యాన్ని ఆసుపత్రిలో మాత్రమే కాదు మన వంటగదిలో, మన రోజువారీ అలవాట్లలో కాపాడుకోవాలని అన్నారు.ఆధునిక జీవనశైలిని పూర్తిగా



వదిలేయడం సాధ్యం కాకపోయినా అందులో ఆరోగ్యకరమైన అలవాట్లను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డబ్బు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు కానీ కోల్పోయిన ఆరోగ్యాన్ని పూర్తిగా తిరిగి పొందడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు అన్నారు. అందుకే వ్యాధితో పోరాడే ముందు మన జీవనశైలితో పోరాడాలని అన్నారు. భవిష్యత్తులో ట్రస్ట్ చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

# ఆటో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**● జమ్మికుంటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**



**జమ్మికుంట:మన జనప్రగతి సెప్టెంబర్ 06:** ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జమ్మికుంట పట్టణంలో ఆటో డ్రైవర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆటో కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ఆర్థిక సహాయం అందించాలని, ప్రమాద బీమా కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరారు. ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.నిరసన ర్యాలీకి జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్, కేడీసీసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వైస్ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మార్కెట్ చైర్మన్ పోల్సాని సత్యనారాయణ తదితర నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఆటో కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# 8న 18 వేల మంది హైదరాబాదుకు తరలివెళ్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

**● ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి ● రూ.2 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలి ● చలో అసెంబ్లీకి 18 వేల మంది ఉద్యోగులు సిద్ధం**

**తొర్రూరు ప్రతినిధి,మన జనప్రగతి సెప్టెంబర్ 06:** పదవి విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగుల సత్తా ఏమిటనేది 8వ తేదీ న అసెంబ్లీ ముట్టడిలో తెలుస్తుందని గతంలో పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించిన పెట్టారని ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పదవి విరమణ పొందిన ఉద్యోగులందరికీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల ఐక్యవేదిక మండల అధ్యక్షుడు గూడెల్లి చంద్రయ్య, కార్యదర్శి పంజాల వెంకన్న గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం తొర్రూరు విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.2017 నుంచి ఇప్పటివరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వేతన సవరణలకు సంబంధించిన ఏరియర్స్, డిఫరెన్స్‌తో పాటు ఇతర బకాయిలు చెల్లించకుండా ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆరోపించారు. తక్కువ వేతనాలతో 4045 ఏళ్ల పాటు సంస్థలో సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులు ప్రస్తుతం పెన్షన్, బకాయిలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.2017, 2021 వేతన సవరణలకు సంబంధించిన బకాయిలతో



పాటు ఇటీవల పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, చివరి నెల జీతం తదితర బకాయిలు కూడా చెల్లించాల్సి ఉందన్నారు. మొత్తంగా రిటైర్డ్ ఉద్యోగులకు సుమారు రూ.2 వేల కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు.బకాయిల కోసం గత ఏడాది కాలంలో రిటైర్డ్ ఉద్యోగులు బస్ భవన్ ఎదుట నాలుగుసార్లు శాంతియుత నిరసనలు, ధర్నాలు, ఉపవాస దీక్షలు చేపట్టారని చెప్పారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు.ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలని కోరుతూ సెప్టెంబర్ 8న 'చలో అసెంబ్లీ' కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా బకాయిలు రావాల్సిన సుమారు 18 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు హాజరుకానున్నారని వెల్లడించారు.బకాయిలు అందక అప్పులు తీర్చలేక, పిల్లల వివాహాలు చేయలేక ఇబ్బందులు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ.2 వేల కోట్ల బకాయిలను విడుదల చేసి



ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని గూడెల్లి చంద్రయ్య, పంజాల వెంకన్న గౌడ్ డిమాండ్ చేశారు.

# పేద వృద్ధ మహిళలకు మధురమ్మ ట్రస్ట్ చేయూత

**- 40 మందికి చీరల పంపిణీ**



**జమ్మికుంట:మన జనప్రగతి సెప్టెంబర్ 06:** పేదలు, వృద్ధులకు అండగా నిలుస్తూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శాలపల్లిఇందిరానగర్ గ్రామంలో పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ సూచించిన 40 మంది పేద వృద్ధ మహిళలకు ట్రస్ట్ నిర్వాహకులు, సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్, సర్పంచ్ కోడిగూటి కిరణ్ చేతుల మీదుగా చీరలను అందజేశారు.**"వృద్ధుల సంక్షేమం మనందరి బాధ్యత": సర్పంచ్ కోడిగూటి కిరణ్** ఈ సందర్భంగా సర్పంచ్ కోడిగూటి కిరణ్ మాట్లాడుతూ.. "వృద్ధులకు సమయానికి ఆహారం అందేలా చూడడంతో పాటు, వారి ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అవసరమైన సహాయం అందించాలి. వృద్ధులు తమ శేష జీవితాన్ని సంతోషంగా గడిపేలా చూడటం మనందరి బాధ్యత. ప్రతి సంవత్సరం పేదలకు చీరలు పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మధురమ్మ ట్రస్ట్‌ను అభినందిస్తున్నాం. మా గ్రామంలోని పేద వృద్ధ మహిళలకు చీరలు అందించినందుకు ట్రస్ట్ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు" అని తెలిపారు.సామాజిక సేవలో భాగంగా పేద వృద్ధ మహిళలకు మధురమ్మ ట్రస్ట్ అందిస్తున్న సహకారం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కే. శ్రీధర్ రెడ్డి, జీవన్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు నేటి నుంచే దరఖాస్తులు

**• సెప్టెంబర్ 16 వరకు స్వర్ణ గ్రామ / స్వర్ణ వార్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి: ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి**



**సింహాద్రిపురం మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఎన్టీఆర్ భరోసా' పథకం కింద నూతన పింఛన్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.నేటి నుండి సెప్టెంబర్ 16 వరకుస్థానిక స్వర్ణ గ్రామ / స్వర్ణ వార్డు కార్యాలయాలలో వృద్ధాప్య,వితంతు,ఒంటరి మహిళలు,దివ్యాంగులు తదితర నిబంధనల పరిధిలోని అన్ని రకాల పింఛన్లను దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.పింఛన్ల దరఖాస్తుకు కావలసిన పత్రాలు ఆధార్ కార్డుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు (దివ్యాంగ సర్టిఫికెట్,డెత్ సర్టిఫికెట్ మొదలైనవి) దరఖాస్తు ఫారమ్‌కు జత చేసి ఇవ్వవలసి ఉంటుంది.దరఖాస్తు గడువు ముగిసిన అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తుది లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వానికి నివేదిస్తారని,త్వరలోనే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ఎంపీడీఓ స్పష్టం చేశారు.మండల పరిధిలోని అర్హులైన వారు వెంటనే సమీప సచివాలయాన్ని సంప్రదించి నిర్ణీత ఫారమ్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థులకు అవగాహన



**పెండ్లిమర్రి మన జనప్రగతి సెప్టెంబర్ 06:–**రాబోయే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతలను పరిరక్షించేందుకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని నంది మండలం గ్రామంలో, పెండ్లిమర్రి ఎస్.ఐ తులసి నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్థులకు ఎన్నికల సమయంలో శాంతి, సామరస్యాలను పాటించాలని, పరస్పరం గొడవలు, వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నియమ నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు.గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పోలీసులకు సహకరించాలని గ్రామస్థులకు సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని ఎస్.ఐ. తులసి నాగ ప్రసాద్ తెలిపారు.

# డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యానికి నారా లోకేష్ భరోసా

**అధైర్యపడొద్దు.. నేనున్నాను.. రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉండాలి: లోకేష్**

**తిరుపతి, మన జనప్రగతి సెప్టెంబర్ 06:–** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యానికి మంత్రి నారా లోకేష్ భరోసా కల్పించారు. ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న నారా లోకేష్‌కు బాలసుబ్రమణ్యం స్వాగతం పలికారు.ఈ సందర్భంగా లోకేష్ ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడుతూ లి"అధైర్యపడొద్దు.. నేనున్నాను"లి అంటూ ధైర్యం చెప్పారు. మున్ముందు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ అధిష్టానం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. లోకేష్ అందించిన భరోసా తనకు మరింత ఉత్సాహాన్ని, బాధ్యతను కలిగించిందని డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, నారా లోకేష్ మార్గదర్శ కత్వం లో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత చురుగ్గా పనిచేస్తానని పేర్కొన్నారు.



# రవీంద్రభారతిలో అంగరంగ వైభవంగా మహా గురువుల గురుపూజోత్సవం

**ఆర్కే కళా సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన కార్యక్రమం**

**ఆధ్యాత్మిక గురువు ఆచార్య తిరునగరి వెంకటేశ్వర స్వామికి ఘన సన్మానం**







**హైదరాబాద్ మన జనప్రగతి సెప్టెంబర్ 06:** ఆర్కే కళా సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా గురువుల గురుపూజోత్సవ కార్యక్రమం ఆదివారం రవీంద్రభారతి వేదికగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఆచార్య తిరునగరి వెంకటేశ్వర స్వామిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పుల్లేటికుర్తి సంజయ్, వ్యాగ్రా లక్ష్మీ, విశ్వనాథ, నాగేంద్ర కుమార్ తదితరులు మాట్లాడుతూ.. తిరునగరి వెంకటేశ్వర స్వామి గురుముఖంగా తాము తీసుకున్న ఆధ్యాత్మిక సాధనను 41 రోజులపాటు నమ్మకంతో కొనసాగించామని తెలిపారు. ఆ సాధన ద్వారా తమకు అద్భుతమైన ఫలితాలు లభించాయని పేర్కొన్నారు. గురువు గురుపూజ మహోత్సవానికి హాజరుకావడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు.విశ్వహిందూ ఐక్యతే విశ్వశాంతికి మూలంపూజ్య గురువులు తిరునగరి వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ గురుపూజ కార్యక్రమాలు సనాతన సంప్రదాయంలో అఖండ భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించబడుతున్నాయని అన్నారు. ధర్మో రక్షతి రక్షితః అనే హిందూ ధర్మ సిద్ధాంతమే దీనికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.భారతదేశం కర్మభూమి, ధర్మభూమి అని, విశ్వహిందూ ఐక్యతే విశ్వశాంతికి మూలమని ఆయన అన్నారు. అఖండ హిందూ సంస్కృతిలోని కట్టు, బొట్టు, ఆచారాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నేటి యువతను మరింతగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.నేటి విశ్వహిందూ యువత ఆధ్యాత్మిక తరంగంగా ముందుకు సాగుతోందని, ప్రపంచ దేశాలకు భారతీయ సనాతన సంస్కృతి తలమానికంగా నిలుస్తోందని తిరునగరి వెంకటేశ్వర స్వామి వ్యాఖ్యానించారు.కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు, కళాకారులు, ఫౌండేషన్ ప్రతినిధులు, భక్తులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

**మంద కృష్ణ మాదిగ ఆదేశాలతో**

**సంస్థాగత నిర్మాణానికి శ్రీకారం**

**కొత్త మండల కమిటీని ప్రకటించిన నాయకత్వం**

**కోరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో సమావేశం**



**ఉప్పల్, మన జనప్రగతి సెప్టెంబర్ 06:**పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, మండల ఇంచార్జ్ కోరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఉప్పల్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ఇంచార్జ్‌లు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, కేశపాగ రాంచందర్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ సమావేశానికి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఉప్పల్ మండలంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం ఉప్పల్ ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా మిద్దెపాక క్రాంతి మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దాసరి యాదగిరి, ఉపాధ్యక్షులుగా చిలుకూరి శ్రీకాంత్, మోతే సురేష్ మాదిగ, కోరపాక యోగేష్ మాదిగ, జి. మహేష్ బాబులను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా తాళ్లపల్లి మహేష్, కందుల రాజు, చింత మధు తదితరులను ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

# 30 మంది రోగులతో గుర్తురు నుండి హైదరాబాద్‌కు వెళ్లిన మెడికల్ బస్సు

**- గ్రామ సర్పంచ్ విసంపల్లి కవితా బాలకృష్ణ వెల్లడి**

**- రోగులకు ధైర్యం నింపి పంపించిన విసంపల్లి బాలకృష్ణ**



**తొర్రూరు ప్రతినిధి, మన జనప్రగతి సెప్టెంబర్ 06:** గ్రామంలో అందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని మా ధ్యేయం అంటున గుర్తురు గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ.గ్రామ సర్పంచిగా గెలిచిన అనంతరం ఇది రెండవ మెడికల్ క్యాంపు గా గ్రామస్తులందరికీ గత నాలుగు రోజుల క్రితం వైద్య పరీక్షలు నిర్వహించి వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న గ్రామస్తులను వారి బాధలను గుర్తించి హైదరాబాదులోని మల్లారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కు పంపించడం జరిగిందని కవితా బాలకృష్ణ పేర్కొన్నారు. మల్లారెడ్డి మెడికల్ ఇన్స్టిట్యూట్ లోని వైద్యులు ఓబుల్ రెడ్డి సలహా సూచనల మేరకు సర్పంచ్ కవితా బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని గుర్తుర్ గ్రామంలోగత నాలుగు నెలల క్రితం గ్రామంలోని కంటి బాధలతో బాధపడుతున్న వృద్ధులను ఇదే ఇన్స్టిట్యూట్ కు పంపించి వారికి తగిన కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామం నుండి బయలుదేరిన 30 మంది రోగులకు ఆసుపత్రిలో ఐదు రోజులు వైద్య పరీక్షలు నిర్వహించి గ్రామం నుండి తీసుకువెళ్లిన బస్సులోని తిరిగి క్షేమంగా ఇల్లు చేర్పించుకునే బాధ్యత మాపై ఉందని విసంపల్లి బాలకృష్ణ పేర్కొన్నారు. వైద్య పరీక్షలకు వెళ్లిన వారందరి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధైర్య పడకుండా ఉండేందుకు వారితో పాటు గ్రామం నుండి ఒక ఇద్దరిని పంపించామన్నారు. బస్సులో వెళ్ళిన రోగులకు అన్ని రకాల వస్తువులను ఇనిస్ట్యూట్ వారే ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. వైద్య పరీక్షల కోసం వెళ్ళిన రోగులందరూ క్షేమంగా తిరిగి రావాలని మనము కోరుకుందాం.

# సమాజానికి సంపద జర్నలిస్టులు

**- జర్నలిస్టులకు సన్మానం గౌరవప్రదమైనది**

**- వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ (వివన్ కెసిజిఎఫ్) దాసా శ్రీనివాసరావు**




**ఖమ్మం ప్రతినిధి, మన జనప్రగతి సెప్టెంబర్ 06:** సమాజానికి సంపద జర్నలిస్టులు అని వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ (వివన్ కెసిజిఎఫ్) దాసా శ్రీనివాసరావు అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రసేన గుప్త 107వ జయంతిని పురస్కరించుకొని జరుగుతున్న వారోత్సవాలలో భాగంగా ఆదివారం జర్నలిస్టుల దినోత్సవం సందర్భంగా ఖమ్మం పులిపాటినగర్ వాసవిక్లబ్ వారి సౌజన్యంతో జర్నలిస్టులను శాలువలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా దాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సమాజ అభ్యున్నతికి పాటుపడే వారిని గుర్తించి సన్మానించడం ఆనవాయితీగా ఉందన్నారు. అందులో భాగంగానే ప్రజలకు ప్రభుత్వానికి వారధులైన సీనియర్ జర్నలిస్టులు టిఎస్ చక్రవర్తి, కొరకొప్పుల రాంబాబు, కొమిరే వెంకటేశ్వర్లు, మేడి రమేష్ లను శాలువలతో సత్కరించి ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. రీజియన్ సెక్రెటరీ బూర్ల పుల్లారావు, అధ్యక్షులు కొదుమూరి భద్రయ్య, సెక్రటరీ సిద్ధంశెట్టి శ్రీకాంత్, వజినేపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174